క్లుప్తంగా

నేడు ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభ

ఖమ్మం మామిళ్లగూడెం: హైదరాబాద్‌లో ఆదివారం జరగనున్న ముదిరాజ్‌ల ఆత్మ గౌరవ సభను జయప్రదం చేయాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి పతానపు వెంకటేశ్వర్లు, నాయకులు కొప్పెర వెంకటనరసయ్య, కొప్పెర జానకీరాములు, నర్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ సంఘాలు ఏవైనా అందరూ సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ముద్రబోయిన మంగయ్య, పిట్టల రాంబాబు, దాంతాల నర్సింహారావు, నర్ల శేషు, తురక నారాయణ, బైరు గురునాథం, శ్రీనివాసరావు, నర్ల శేషయ్య, పి.రమేష్, లేళ్ల లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఈజీఎస్ ఉద్యోగుల వినతి

కూసుమంచి: ఐకేపీ ఉద్యోగుల మాదిరి తమకు కూడా పేస్కేలును అమలు చేయాలని కోరుతూ శనివారం పాలేరు డివిజన్‌లోని ఈజీఎస్ ఉద్యోగులు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని జేఏసీ నాయకులు ఎమ్మెల్యేను కోరారు. ప్రభుత్వం స్పందిస్తేనే వారికి న్యాయం జరుగుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అప్పారావు, కోటేశ్వరరావుతో పాటు ఉద్యోగులు సునీత, నర్సింహారావు, శ్రీదేవి, కరుణ, వెంకటేష్, నర్సింగ్, మనోహర్, కృష్ణయ్య, తులసి, నరేష్ పాల్గొన్నారు.

మానవ హక్కుల కౌన్సిల్ జిల్లా అధ్యక్షురాలిగా సరిత


నియామక పత్రం అందుకుంటున్న సరిత

తిరుమలాయపాలెం: జాతీయ మానవ హక్కుల కౌన్సిల్ జిల్లా అధ్యక్షురాలిగా మండలంలోని కాకరవాయి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కొత్తపల్లి సరితను ఎంపిక చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని కౌన్సిల్ కార్యాలయంలో జాతీయ మానవ హక్కుల చైర్మన్ సంపత్ కుమార్, జనరల్ సెక్రెటరీ బి.అరుణ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏం రవికుమార్ సరితకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ. జిల్లాలో మానవ హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. త్వరలో జిల్లా కమిటీ సభ్యుల నియామకం జరుగుతుందని సరిత తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని టౌన్-1 సెక్షన్ పరిధిలో 33/11 కేవీ దానవాయిగూడెం ఉపకేంద్రం సారథినగర్ 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు, ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సెక్షన్ ఏఈ మౌర్విక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో సారథినగర్, వెంకటేశ్వర నగర్, పద్మావతినగర్, జూబ్లీస్కూల్ ఏరియా, జూబ్లీక్లబ్ రోడ్, ఫిష్ హౌస్‌లైన్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

దాడి ఘటనపై కేసు

ఖమ్మంరూరల్: ఇద్దరిపై దాడి చేసిన ఘటనపై శనివారం కేసు నమోదైంది. ఎస్సై షాకీర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఏదులాపురం శివారు వరంగల్ క్రాస్‌రోడ్డుకు చెందిన నారపొంగు సాయి అన్వేష్ నాయుడుపేట వద్ద స్నేహితులతో మాట్లాడుతుండగా అదే గ్రామానికి చెంది లోకేష్ మరికొందరితో కలిసి దాడిచేశాడు. అన్వేష్ స్నేహితుడు వినోద్ వారించగా అతనిపై కూడా దాడి చేయడంతో ఇరువురికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

సమ్మెకు మద్దతు

ఖమ్మంరూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని ఈ పంచాయతీ టెక్నికల్ వింగ్ సిబ్బంది సమ్మె చేస్తుండగా సమ్మె శిబిరాన్ని ఎంపీఓ, గ్రామ కార్యదర్శులు శనివారం సందర్శించి తమ సంపూర్ణ మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాంతియుతంగా నిరసన తెలిపి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యదర్శులు శ్రీనివాసరావు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	స్కంద
వినోద	చిన్నా 800
సాయిరాం	మామా మశ్చీంద్ర
ఆదిత్య	మ్యాడ్
శ్రీనివాస	చంద్రముఖి 2
సుందర్	రూల్స్ రంజన్

- ఖమ్మం గాంధీచౌక్



సీతాఫలం.. ఆ మాట వింటేనే అందరికి తినాలని పించే ఫలం.. మధురఫలంగా పిలుచుకునే దీని సీజన్ ప్రారంభమైంది. చిన్నా, పెద్ద తేడా లేకుండా ఈ ఫలాన్ని తినడానికి ఇష్టపడుతుంటారు. రుచితో పాటు ఆరోగ్యానికి కూడా దోహదపడటంతో ప్రజలు విరివిగా కొంటున్నారు. - ఖమ్మం సహకారనగర్



సీతాఫలం.. ఆగమనం..

మొదలైన మధురఫలం సీజన్

- జోరందుకున్న విక్రయాలు
- ఆదరణ పెరగడంతో ఇతర జిల్లాల నుంచి దిగుమతి
- రుచితోపాటు ఆరోగ్యం



సీతా ఫలానికి నగరవాసుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. జిల్లాతో పాటు వివిధ జిల్లాలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంకు చెందిన పలు రకాల సీతాఫలాల విక్రమాలు నగరంలో జోరందుకున్నాయి. ప్రజల నుంచి ఆదరణ పెరగడంతో ఇతర జిల్లాల నుంచి సైతం దిగుమతి చేసుకుంటున్నారు.

ప్రధాన రహదారుల వెంట..

నగరంలోని పలు ప్రధాన రహదారుల వెంట సీతాఫలాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఇల్లెందు క్రాస్‌రోడ్ నుంచి జెడ్పీ సెంటర్ వరకు, ప్రభుత్వాస్పత్రి సమీపంలో, బైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో సీతాఫలాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

దిగుమతి ఇలా... ధరలిలా

ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి, మహబూబాబాద్ జిల్లా గార్ల, బయ్యారం ప్రాంతాల నుంచి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి సీతాఫలాలు ఖమ్మం నగరంలో విక్రయాలు జరుగుతున్నాయి. ఒక్కొక్క ప్రాంతాన్ని బట్టి, ఒక్కొక్క సైజును బట్టి ధరలు ఉన్నాయి. కిలో ధర రూ.100 నుంచి మొదలుకొని రూ.250 వరకు పలుకుతున్నాయి. సీజన్‌లో వచ్చే ఫలాలు కావటంతో నగరవాసులు ఆసక్తి కనబరుస్తున్నారు.


జిల్లా కేంద్రంలో సీతాఫలాల విక్రయాలు..

రుచితో ఆరోగ్యం..

సీతాఫలంలో విటమిన్ ఏ, బీ,కేలతో పాటు ప్రోటీన్, కాల్షియం, పాస్పరస్, మెగ్నీషియం, కాఫర్, ఫైబర్, ఐరన్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను బయటకు పంపి అధిక బరువు తగ్గించి జీర్ణ సంబంధిత సమస్యల నుంచి విముక్తి కలిగిస్తుందని వైద్యులు చెబుతున్నారు.



వ్యాపారం ఫర్వాలేదు



నేను ఆరేళ్లుగా సీతాఫలాల విక్రయాలు చేస్తున్నాను. సైజును బట్టి ధరలు ఉన్నాయి. సీజన్‌లో వచ్చే ఫలాలు కావటంతో వినియోగదారులు ఆసక్తిగానే కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారం ఫర్వాలేదు.

– తాడిచెట్టు ఉపేందర్, వ్యాపారి

ఇష్టంతో కొనుగోలు చేసా..



సీతాఫలాలు ప్రతి సీజన్‌లో ఇష్టంతో కొనుగోలు చేస్తుంటాను. శీతాకాలంలో అధికంగా లభించే ఫలాలు. సీతాఫలం ఎన్నో పోషకాలను అందిస్తుందని ప్రగాఢ నమ్మకం. ఆరోగ్యానికి మేలు చేస్తుందని విశ్వాసం.

– వి.కల్యాణి, ఖమ్మంనగరం

ఎల్‌ఈడీ బల్బులతో విద్యుత్ ఆదా


బల్బులను పంపిణీ చేస్తున్న ఏడీఈ కోక్యానాయక్

కూసుమంచి: గృహ వినియోగదారులు ఎల్‌ఈడీ బల్బులను పెట్టుకుని విద్యుత్‌ను ఆదా చేసుకోవాలని ట్రాన్స్‌కో కూసుమంచి ఏడీఈ కోక్యా నాయక్ కోరారు. శనివారం ఏడీఈ కార్యాలయంలో ఎల్‌ఈడీ బల్బుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ బల్బులు కావాల్సిన వారు మూడు నెలల క్రితం నాటి విద్యుత్ బిల్లును చూపించి తమ కార్యాలయంలో పొందవచ్చునన్నారు. బల్బులకు 3 సంవత్సరాల వారంటీ ఉంటుందని, ఒక్కో బల్బు రూ.25 చెల్లించి తీసుకోవాలన్నారు. ఒక మీటరుకు 5 బల్బులను మాత్రమే పంపిణీ చేస్తామని, గ్రామాల్లో విద్యుత్ బిల్లులు కట్టించుకునే సిబ్బంది వద్ద కూడా ఈ బల్బులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ గ్రేస్ సృజన, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీ సేన రాష్ట్ర కార్యదర్శిగా వీరేందర్


నియామకపత్రం అందుకుంటున్న వీరేందర్

నేలకొండపల్లి: బీసీ సేన రాష్ట్ర కార్యదర్శిగా మాగంటి వీరేందర్ ను నియమిస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. సంఘం బలోపేతం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. వీరేందర్ నియమాకంపై పలువురు హర్షం వ్యక్తం ప్రకటించారు.

అన్ని వర్గాల ప్రజలకు ప్రవక్త ఆదర్శం


గీటురాయి సంచికను ఆవిష్కరిస్తున్న మహిళలు

ఖమ్మం మామిళ్లగూడెం: దైవప్రవక్త అన్నివర్గాల ప్రజలకు ఆదర్శమని జమాతే ఇస్లామిహింద్ జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు సమీనా అన్నారు. ప్రవక్త జీవిత చరిత్ర విశేషాలపై వెలువడిన గీటు రాయి ప్రత్యేక సంచికను శనివారం ఖమ్మంలో ఆవిష్కరించారు. అనంతరం మహిళా డాక్టర్లు, టీచర్లను కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖిల్లా యూనిట్ కార్యదర్శి హాజీరా, ఫర్జానా తదితరులు పాల్గొన్నారు.

హామీలు విస్మరించారు..

నేలకొండపల్లి: తెలంగాణ ప్రభుత్వం అందించే పథకాలు కేవలం బీఆర్‌ఎస్ వారికే అందిస్తున్నారని, గత హామీలను సీఎం కేసీఆర్ గాలికొదిలారని సీపీఎం నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని రాజేశ్వరపురంలో శనివారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు... జిల్లాలో అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికి గృహలక్ష్మి పథకం ను మంజూరు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన వారిని లబ్ధిదారులు గా ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి కె.వీ.రెడ్డి, మాజీ ఎంపీపీ రచ్చా నరసింహారావు, మందడపు మురళీకృష్ణ, కట్టికోల వెంకన్న, యలమద్ది లెనిన్, రాసాల నవీన్, పుసులూరి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నృత్య పోటీల్లో విద్యార్థిని ప్రతిభ


అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీనివాస్

ఖమ్మం సహకారనగర్: ఇటీవల వరంగల్‌లో జరిగిన జాతీయ నృత్య పోటీల్లో తమ పాఠశాల విద్యార్థిని ప్రతిభ కనబర్చినట్లు ది ఫ్యూచర్ కిడ్స్‌స్కూల్ కరస్పాండెంట్ సిహెచ్.శ్రీనివాస్ తెలిపారు. శనివారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జ్ఞానసహస్ర, రిత్వికలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్నేహప్రియ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

కామేపల్లి: గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని తాళ్లగూడెం సర్పంచ్ లకావత్ సునీత, పింజరమడుగు ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య అన్నారు. గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు వారు శనివారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఉపసర్పంచ్ పుచ్చకాయల సత్యనారయణ, నల్లమోతు వెంకటనర్సయ్య, పుచ్చకాయల అప్పారావు, తెల్లబోయిన సురేష్, గోకర ఉపేందర్, కంపసాటి కృష్ణ, ఎర్రబోయిన ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సినీ నటి శహరి సందడి


శహరితో యాజమాన్యం, ప్రేక్షకులు

ఖమ్మంగాంధీచౌక్: ఇటీవల విడుదలైన స్కంద సినిమాలో నటించిన సుంకర శహరి శుక్రవారం రాత్రి ఖమ్మం వచ్చారు. ఈ సందర్భంగా ఇల్లెందుకు చెందిన ఆమె తిరుమల థియేటర్‌లో సినిమా వీక్షించి ప్రేక్షకులతో మాట్లాడారు. థియేటర్ యాజమాన్యం శ్రీనివాసరెడ్డి, ఆర్వీఎస్.సాగర్, తాజుద్దీన్, రమేష్, రేవతి, జానీపాషా తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్లు వితరణ


పంపిణీ చేసిన ప్లేట్లతో విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: అమెరికాలో ఉంటున్న మద్దినేని అనన్య జన్మదినం సందర్భంగా వారు తల్లిదండ్రులు మద్దినేని కమల ప్రసాదరావు దంపతులు నగరంలోని ఎన్నెస్పీకాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ప్లేట్లను అందజేశారు. హెచ్‌ఎంలు మోతుక్కూరి మధు, ఎం.శంకర్‌రావు, చావా రమేష్‌బాబు, గోపాలరావు, వెంకటరావు, ఏపూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించాలి


వనజీవి రామయ్యను సన్మానిస్తున్న అధికారులు

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం ఉన్నత పాఠశాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో శనివారం వన్యప్రాణుల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి పద్మశ్రీ వనజీవి రామయ్య మాట్లాడుతూ... అటవీ జంతువులను వేటాడటం, చంపడం చట్టరీత్యా నేరమని, ప్రతీ ఒక్కరూ వన్యప్రాణులను ప్రేమించి సంరక్షించడం మన బాధ్యతని తెలిపారు. అనంతరం వనజీవి. రామయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, డిప్యూటీ రేంజర్ సురేష్‌కుమార్, బీట్ ఆఫీసర్ హరికృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యపరీక్షలు అభినందనీయం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ నాగేశ్వరరావు

ఖమ్మం సహకారనగర్: ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టులకు ఉచిత వైద్యసేవలందించడం అభినందనీయమని ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం ప్రెస్‌క్లబ్, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యాన యశోద ఆస్పత్రి సౌజన్యంతో శనివారం ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని ఎంపీ ప్రారంభించి మాట్లాడారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాంనారాయణ మాట్లాడగా జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లుతో పాటు మైసా పాపారావు, నేర్వనేని వెంకట్రావు, ఆవుల శ్రీనివాసరావు, మామిడాల భూపాల్, నలజాల వెంకట్రావు, గోపి, నామ పురుషోత్తం, మొహిసుద్దీన్, తాళ్లూరి మురళి, జనార్దనాచారి, సాగర్, చెరుకుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే రోడ్లకు మహర్దశ


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి: బీఆర్‌ఎస్ హయాంలో రహదారులకు మహర్దశ కలుగుతుందని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని లింగారం తండా- గట్టుసింగారం, లింగారంతండా- గన్యాతండా, చేగొమ్మ- కొండాపురం బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా దివ్యాంగులకు వికలాంగుల పెన్షన్‌ను ప్రభుత్వం రూ.4,116కు పెంచగా వారికి అందుకు సంబంధించిన పత్రాలను క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక ప్రతీ గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం వచ్చిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఫించన్లు అందుతున్నాయన్నారు. పాలేరును మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్నానని, మరో మారు ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్ నాయక్, డీసీసీబీ డైరక్టర్ ఇంటూరి శేఖర్, ఆత్మా కమిటీ చైర్మన్ రామసహాయం బాలకృష్ణారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

పరాయి పాలన అవసరమా..

నేలకొండపల్లి: మన పాలేరు నియోజకవర్గానికి పరాయి పాలన అవసరమా అని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ప్రశ్నించారు. మండలంలోని పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. బోదుల బండ-కోనాయిగూడెం రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చెరువుమాధారం క్రాస్‌రోడ్డు ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం శనివారం రాత్రి జరిగిన సభలో మాట్లాడారు... పంట పొలాలు ఎండిపోతున్నాయని నీరు అడిగితే అసభ్యకరంగా మాట్లాడిన వారు కావాలా, లేక మీరు అడిగిన ప్రతి సారి నీరు విడుదల చేసిన తాను కావాలా అని ప్రజలే తెల్చుకోవాలని సూచించారు.

నిమ్స్ తరహా ఆస్పత్రి ఏర్పాటుచేయాలి


మందులు అందజేస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: మూడు రాష్ట్రాల నుంచి వేలాదిమంది పేదలు చికిత్స కోసం ఖమ్మం వస్తున్న నేపథ్యాన హైదరాబాద్ నిమ్స్ తరహాలో కొత్త ఆస్పత్రి నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సీపీఎం ఖమ్మం టూటౌన్ కమిటీ, బీవీకే ఆధ్వర్యాన నగరంలోని మంచికంటి హాల్‌లో శనివారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు అల్లంపాటి రమేష్‌రెడ్డి, జొన్నలగడ్డ వరుణ్, సి.భారవి, పి.సుబ్బారావు, జెట్ల రంగారావు, జి.రాజేష్ వైద్య సేవలు అందించాక నాగేశ్వరరావు మాట్లాడారు. ఆరేళ్లుగా ప్రతినెలా మెడికల్ క్యాంపు నిర్వహిస్తుండడంతో పేదలకు మేలు జరుగుతోందని తెలిపారు. అనంతరం యశోద ఆస్పత్రి వారి సహకారంతో కాన్సర్ పరీక్షలు నిర్వహించారు. నాయకులు వై.విక్రమ్, వై శ్రీనివాసరావు, చంద్రశేఖర్, శివనారాయణ, వాసిరెడ్డి వీరభద్రం, పి.వాసు, అఫ్జల్, పి.కృష్ణారావు, టి.జనార్దన్‌స్వామి, టి.వెంకట్రావు, వి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

12నుంచి పీవైఎల్ రాష్ట్ర మహాసభలు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంరాపర్తినగర్: ఈనెల 12, 13వ తేదీల్లో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో పీవైఎల్ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాటోత్ ప్రేమ్‌సింగ్, ఎస్వీ.రాకేష్ తెలిపారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం వారు మహాసభల పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రాల్లోని పాలకులు యువతను నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈమేరకు మహాసభల్లో పోరాట కార్యాచరణ రూపొందించనుండగా యువత పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు మందా సురేష్, కూసు మోహన్‌రెడ్డి, ధరణ్, మామిడాల వెంకటేష్, గోకినేపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ పాదాలు

ఖమ్మంగాంధీచౌక్: జిల్లాలోని 60 మంది దివ్యాంగులకు ఖమ్మం శుక్రవారపుపేట గణేష్ ఉత్సవ కమిటీ, డిస్ట్రిక్ట్ ఎన్నారై ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యాన శనివారం ఉచితంగా కృత్రిమ పాదాలు అందజేశారు. రోటరీ లింబ్ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరగగా ప్రతినిధులు బి.బాబు, సాంబశివరావు, రంగారావు, బి.నవీన్, వీరనగేష్, వల్లాల యుగంధర్, బి.అరుణ్‌కుమార్, మధు, భానుచందర్, దామోదర్ పాల్గొన్నారు.

వ్యక్తిగతంగా దూషిస్తే చర్యలు తప్పవు

తిరుమలాయపాలెం: సోషల్ మీడియాలో రాజకీయ నాయకులు, ఇతర వ్యక్తులపై వ్యక్తిగత దూషణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై వరాల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాట్సాప్ గ్రూపులలో అసత్య వార్తలు, ఇతర వర్గాలకు ఇబ్బందులు కలిగించే పోస్టులు పెట్టినా కేసులు నమోదు చేస్తామని గ్రూపు సభ్యులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కామేపల్లి: వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి చందన కోరారు. శనివారం మండలంలోని ఊట్కూర్, జాస్తిపల్లి, రేపల్లెవాడ గ్రామాల్లో ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి రోగులను పరీక్షించారు. డాక్టర్ నవ్యశ్రీ, శిరీష, ఏఎస్‌ఎంలు పాల్గొన్నారు.

కెప్టెన్ బంజరలో పశువైద్య శిబిరం..

జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం కెప్టెన్‌బంజర గ్రామంలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ మేరకు పశువులకు చికిత్స నిర్వహించి మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ గుంపెనపల్లి అనంతరాములు, ఏడీఈఓ డీఎల్‌డీఏ డాక్టర్ కిషోర్, పశు వైద్యాధికారి డాక్టర్ గోపికృష్ణ, గోపాలమిత్ర సూపర్‌వైజర్ నరసింహారావు, సయ్యద్ జాన్ పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలు పంపిణీ


కూసుమంచి: పెరికసింగారంలో..


కామేపల్లి: ముచ్చర్లలో ..

కూసుమంచి: మండలంలోని పెరికసింగారం గ్రామంలో శనివారం బతుకమ్మ చీరలను ఎంపీటీసీ మోదుగు వీరభద్రం, సర్పంచ్ వాసంశెట్టి వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు తెలంగాణా ఆడబిడ్డలకు ప్రభుత్వం బతుకమ్మ కానుక ఇచ్చి గౌరవిమిస్తుందని, ఈ పండుగను ఘనంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, అంగన్‌వాడీ, వీఓ సిబ్బంది పాల్గొన్నారు.

కామేపల్లి: బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ఆడబిడ్డలకు ప్రభుత్వం అందించిన చీరలను మండల వ్యాప్తంగా గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లోని సర్పంచ్, ఎంపీటీసీల చేతుల మీదుగా చీరలను లబ్ధిదారులకు అందజేశారు.